చదువుకుంటావా? గొప్ప వాడివవుతావు మరి  నువ్వు చదవకపోతే ఇంకోళ్ళెవరో చదివి గొప్ప వాళ్ళవుతారు'' అన్నాడు

వాడు తలెత్తి నాలుగక్షణాలు చూసి '' మరయితే మా హెడ్ మాష్టారికన్నా గొప్ప వాణ్ణవుతానా? అన్నాడు.

'' ఆఁ, తప్పకుండా! ఇంకా చాలా చాలా గొప్పవాడివవుతావు''

వాడికళ్ళు మెరిసాయి. '' అయితే చదువుకుంటాను. రెట్టింపుగా మెరిసాయి రామేశం కళ్లు. చటుక్కున వెనక్కొచ్చి కొడుకుని హత్తుకున్నాడు.

రిక్షావాడు ఇంకోడి సహాయంతో ఆ బరువు ఇత్తడి పెట్టెను రిక్షాలో పెట్టిస్తూ,'' అమ్మా తిరుపతి వెడుతున్నానే. ప్రాచ్య లిఖిత భాండాగారం పండితులచేత వీటిని పరిశీలన చేయిస్తాను. వారం పదిరోజులు పట్టోచ్చు  ఉత్తరం రాస్తాను... తలుపేసుకో... విజయవాడ పాసింజరు వెళ్ళిందిరా రిక్షా అబ్బాయి?'' అంటూ హడావుడిగా వెళ్ళి రిక్షా ఎక్కాడు. రామేశం

(భారతి జులై 15,1984.)

★★★ ★★★ ★★★

# శిక్ష

తాను కూడా రోగుల్లోనే జమ అనుకొంది కాబోలు, పదమూడో వార్డులో ఉన్న గోడ గడియారం నీరసంగా పన్నెండు గంటల్ని ప్రసవించి, తారీకును మార్చేసింది.

హఠాత్తుగా ఆకాశంలో మెరుపు మెరిసింది  వెంటనే ఉరుము ఉరిమింది. వార్డుకు అనుకుని ఉన్న డ్యూటీ రూమ్‌లో టేబిల్ మీద మోచేతపై తల ఆన్చి కునికిపాట్లు పడుతున్న డాక్టర్ శ్రీమతి ఉలికిపడి లేచింది.

'వెధవది కురవదు, చావదు. ఉండుండిమాత్రం గుండెలు అవిసేలా చప్పుళ్లు!' - డాక్టర్ శ్రీమతి కుర్చీలోంచి లేచింది  సింక్ దగ్గరకి వెళ్ళి ముఖం కడుక్కొంది. ఇంత పౌడర్ ముఖానికి పూసుకుంది. ఫ్లాస్కులో కాఫీని కప్పులోకి వంచుకుంది. కాఫీ చల్లగా ఉంది, 'వెధవది, కాఫీకి కూడా తనంటే అలుసేనా?' - అయిష్టంగానే కప్పుఖాళీ చేసి వచ్చి కూర్చుంది  ఎదురుగుండా టేబిల్ మీద నీలిరంగు కవరు!

' ఇదుగో, ఈ కవరే, గంట కొక చుక్కగా తన గుండెల్లోని రక్తాన్ని పిండేస్తూంది... ఈ పాటికి రాగిణి స్టేట్స్‌కు చేరుకొని ఉంటుంది కాబోలు  అదృష్టవంతురాలు  ... కాకపోతే, ఏమిటి, అది ఏనాడన్నా చదివిందా? మాటిమాటికీ తమ ప్రొఫెసర్, '' రాగిణీ! నీకీ మెడిసిన్ పడదు. పోయి పెళ్ళిచేసుకొని, పిల్లల్ని పెంచుకో ఫో!'' అని కదూ అనేవాడు! తను సహాయం చెయ్యబట్టి కాదూ అది ఫైనలియర్ పరీక్ష పాసయింది  ఎవరెన్నంటే నేమి, దానికి హైదరాబాదులో మంచి ప్రైవేటు ప్రాక్టీసున్న ఎఫ్.ఆర్.సి.ఎస్. మొగుడూ దొరికాడు, దానికి స్టేట్ సర్వీస్‌లో వెంటనే ఉద్యోగమూ దొరికింది. ఇంకా, స్కాలర్‌షిప్‌తో ఈ వేళ స్టేట్స్‌కూ వెళ్ళింది!... వెళ్ళింది,  వెళ్ళదూ దాని పినమామగారు మెంబరుగా ఉన్నంత కాలమూ దానికిల్లాంటి ఛాన్సులకు కొరతేముంది... ఆ మాటకొస్తే తనదీ స్టేట్ సర్వీసే. ఎందుకూ, అడుక్కుతినే అదృష్టం! తనకు ఫారిన్ ఛాన్సులు లేవుసరే, కనీసం ఊరూపేరయినా లేవు  దానికి కారణం ఈ పదేళ్ళ సర్వీసులోనూ తను అరడజను ఊళ్ళు తిరగటమే! తన నైపుణ్యానికి తగిన సంపాదన అంటూ ఉందా అంటే అదీలేదు పోనీ , మగదండ అంటూ ఏర్పడిందా అంటే, అది మొదలే పూజ్యం! తను పేరుకు మాత్రమే శ్రీమతి

ఇహ బాధ్యతలా - చెప్పనక్కర్లేదు కాలేజీలో ఇద్దరు చెల్లెళ్ళు, స్కూల్లో ఇద్దరు తమ్ముళ్ళు! ఛ! వెధవ బతుకు!'

నర్స్ వచ్చింది రూములోకి. " వార్డులోకి ఒకసారి మీరు రావాలి, డాక్టర్!".. " కాస్సేపాగి వస్తాను. నువ్వువెళ్ళు "... నర్స్ వెళ్ళిపోయింది.

బయట ఉరుము ఉరిమిన శబ్దం. దానితో బాటే మేఘమొకటి డాల్ఫిన్స్‌నోస్ కొండమీదుగా ఆకాశంలోకి పాకి, తెలుగు నాటి కన్నెపిల్లలాగా ఒయ్యారాలు పోతూ ముందుకి సాగి, తన గమ్యం వచ్చినట్టుగా హాస్పిటల్ బిల్డింగు మీదికి వచ్చి మాయమయింది. క్రమంగా ఈదురుగాలి మొదలయింది. ఆ వచ్చిందేదో ఒంటరిగా రాక, తోడుగా సన్నజల్లును వెంటబెట్టుకు వచ్చింది. క్రమంగా,దూరంగా అల్లల్లాడిపోతున్న చెట్ల ఆకులు జల్లునీటితో తడిసి ధగధగలను వెదజల్లుతున్నాయి. జూన్ మాసారంభపు ఎండే మధ్యాహ్నం నించి నేలను, నరుల్ని మాడ్చి పేల్చేసింది. ఇప్పుడు పడుతున్న ప్రథమ వర్షానికి నేలలోనించి వస్తున్న సుగంధం, పక్కవార్డులో ఎవరో వాడుతున్న డెట్టాల్ వాసనతో కలిసి ఆవరణమంతా అలుముకుంటున్నది.

'గ్రీష్మపు వేడికి సంతప్తాలైన శరీరాలకు ఈ జల్లులు ఊరటనిస్తే ఇవ్వవచ్చు. కాని, జీవిత సమరంలో ఓడిపోయి అసంతృప్తులైన తన హృదయం వంటి హృదయాలకు ఈ జల్లులు నిరర్థకాలు... ... మధు! ఆ ఆదివారం సాయంత్రం రామకృష్ణా మిషన్‌కు దూరంగా బీచ్‌లో తామిద్దరూ కూర్చుని ఉన్నప్పుడుఅతను చెప్పిన కబుర్లు ఇంకా మధురంగా లేవూ?

" ఈ నీలిరంగూ, ఆ కెరటాల పొంగూ, ఆ లయధ్వానాల మాధురులూ, అంతంలేనట్లు పాకిపోయే ఈ రొచ్చు ఇసుక నున్నదనమూ- వీటన్నిటినీచూసి బ్రహ్మ ముచ్చటపడి వీటినన్నింటిని తీసికొని , ఓ స్త్రీమూర్తిగా చేసి భూమ్మీద పడేశాట్ట- అదెవరో తెలసా?... కాబోయే డాక్టర్ శ్రీమతి శ్రీమతి మధు."

" ఆహా... ఇంకా?"

" నువ్వు ఎన్నిసార్లు 'ఇంకా' అన్నా , నా లోపలి కవిత్వధార ఎన్నటికీ ఇంకదు సుమా! ... ఇన్ని మాటలెందుకు, శ్రీ, నేను నీ వాడిని. నా హృదయంలోని ప్రత్యణువూ నీకై పరితపిస్తూంది. సరేలే, ఎంతసేపూ నా అభిప్రాయాలు నువ్వు వినటమేనా? కాస్సేపు నీ స్వంత భావాలు చెప్పు- వింటాను... నిన్ను భరించేవాణ్ణిగా నన్ను స్వీకరించటం నీకిష్టమేనా?"

'ఆ వాక్చాతురతకు నవ్వువచ్చింది కాదూ తనకు! " నువ్వు నన్ను భరిస్తావు సరే, మరి నేను భరించవలసిన బరువు మాట ఏమిటి?"

" నీ తమ్ముళ్ళు, చెల్లెళ్ల మాటేనా? వాళ్లను మనమే పోషించి, పెళ్ళిళ్ళు చేద్దామోయ్!"

" వాళ్ల విషయం కాదు... అసలు విషయం! నీవు నన్ను ప్రేమిస్తున్నందుకు నేను నీకు చెల్లించవలసిన ముడుపు విషయం."

" ఛీ, కట్నం విషయమా!.. పిచ్చిదానా! ఆ విషయంలో మానాన్నను ఒప్పించే పూచీ నాది. తోక్కవద్దు - సర్లే, హోటల్లో భోజనం చేసి'పారిస్ బై నైట్'కు వెడదాం.లే,లే."

ఆ తరవాత కాలంలో తామిద్దరూ కలిసి చేసింది ఒక భోజనం కాదు, చూసింది ఒక సినిమా కాదు. ఓహో, ముదసర్లోవలో ఆ షికార్లు... ఎంత మధుర క్షణాలు!

' ఓడిపోయింది! పరీక్ష అయిన మరునాడు అతను వచ్చి, "క్షమించు, శ్రీ! కట్నంలేని మన పెళ్ళికి మా నాన్న ససేమిరా ఒప్పుకోనన్నాడు. వస్తా" లని వెళ్ళిపోయినప్పుడు తను జీవితపు మొదటి మెట్టు మీద ఘోరంగా ఓడిపోయింది!

తెల్లారిపోతుందనుకోలేదు. నాకు తెలుసమ్మా, నీకు భగవంతుడు గట్టి గుండె నిచ్చాడు. తల్లిలేని ఈ పసుగాయలకు ఇక నుంచీ నీవే తల్లివీ, తండ్రివీను... నిన్ను జీవితంలో సుఖపడవద్దని నేననను కానీ, నీ వ్యక్తిగత సుఖం నీకిచ్చే ఆనందం కన్నా, నలుగురు అనాథలను సనాథలుగా చేయటం వల్ల వచ్చే తృప్తి నీకు ఎక్కువ ఆనందాన్నిస్తుందమ్మా!"

- హఠాత్తుగా కళ్ళుచెదిరిపోయేలా మెరుపు మెరిసి, చెవులు చిల్లులు పడేలా మేఘగర్జన వినిపించి నప్పుడు ఆయన, " అమ్మా! అదుగో పిలుపు, అదుగో పిలుపు వెడుతున్నానమ్మా- పిల్లలు జాగ్రత్త" న్నాడు. మళ్ళీమెరిసిన కాంతిలో, ఒళ్ళంతా బిగబట్టుకొని ఒక్కమాటుగా పైకి లేవబోయి, చటుక్కున వెనక్కు పడిపోయి కళ్లుతేలవేసిన ఆయన ముఖాన్ని తను చూసింది. అప్పట్నుంచే కదూ, మేఘగర్జనంటే తనకుభయం డెవలప్ అయింది!

... అప్పులకు చెల్లు వెయ్యగా తమకు మిగిలింది పూజ్యం! చాలీచాలని స్టైఫెండ్‌తో తను హౌస్‌సర్జన్సీ చేసిన మరుసటి ఏడాదంతా తన తమ్ముళ్లనూ, చెల్లెళ్లనూ తమకన్నా, నిర్భాగ్యుడైన తమ బాబాయి సాకి ఉండకపోతే వాళ్ళేమై ఉందురు?

డాక్టర్ శ్రీమతి లేచి సింక్ దగ్గిరికి వెళ్ళిముక్కు చీదుకుంది. హాంగర్ మీది తుండు అందుకొని ప్రవహిస్తున్న అశ్రువులను తుడుచుకొంది.

'ఢమ' - అషాఢ మేఘపు భయంకర గర్జన! ఆకాశానికి వాసెనగా కట్టినతోలు పొరను ఒకే దెబ్బతో ఎవరో భేదించినట్లు ధ్వని! - ఉల్కిపడింది శ్రీమతి. వెంటనే వీపు చరుచుకొంది. మరుక్షణంలో వీచిన గాలికి దఢేలుమని కిటికీ తలుపులు తెరుచుకున్నాయి. ప్రచండ వేగంతో, జల్లుతో కలిసి గాలి లోపలికి వచ్చింది. గుండె అదురును అణచుకుంటూ ఆమె వెళ్ళికిటికీ తలుపులు మూసింది. తిరగి వచ్చి కుర్చీలో కూర్చుంది.

ఆమె దృష్టి మళ్ళీ నీలిరంగు కవరు మీద పడింది.

'ఇదుగో, ఇదుగో, వెధవ కవరు- ఇదే!ఇదే! ఇందాకటినించీ ఆ ఉరుముతో కలిసి తనను జీవితంలో మరోసారి ఓడిపోయిన దాన్నిగా నిరూపిస్తూంది వెధవ కవరు. ఇది రాకపోతే... ఆమె ఆ కవరు అందుకొని ముక్కలుగా చించేసి చెత్తబుట్టలో పారేసింది. గడియారం రెండు గంటలు కొట్టింది.

టేబిల్ మీద తలాన్చి నిద్ర కుపక్రమించింది డాక్టర్ శ్రీమతి.

కంగారు పడుతూ వచ్చింది నర్స్." డాక్టర్, డాక్టర్! మీరొకసారి రావాలి, డాక్టర్! బెడ్ నంబర్ త్రీ, బెడ్ నంబర్ ఫోర్ పేషెంట్సు అదేపనిగా దగ్గుతున్నారు. ఆయాసపడిపోతున్నారు. వాళ్లను తట్టుకోవటం కష్టంగా ఉంది."

డాక్టర్ శ్రీమతి విసుగ్గా తల ఎత్తి చూసింది. ఒక్కసారి ఒళ్లు విరుచుకుంది. " ఊఁ వస్తున్నా పద" అంటూ చెప్పులు తొడుక్కొని నర్స్ వెంట బయల్దేరింది.

నర్స్ చెప్పింది నిజం. మూడో నెంబరు, నాలుగో నంబరు బెడ్‌లలోని పేషెంట్లిద్దరూ విపరీతంగాదగ్గు తున్నారు. శ్వాస అందక కాబోలు దిండ్ల మీద తలలను వెనక్కి విరుచుకుంటున్నారు.

శ్రీమతి మంచాలకు తగిలించిన ఉన్న కేస్ షీట్లను తీసి చూసింది. " ఇద్దరికీ ఆస్తమాయే. అయితే, బెడ్ త్రీకి మాత్రం కార్డియాక్ వెరైటీ - సరే చూస్తాండు."

" ఎస్, డాక్టర్!"

డాక్టర్ శ్రీమతి డ్యూటీ రూములోకి వచ్చింది. బీరువా తీసి వెతికింది. 'ఎమినో ఫిలన్' ఒక ఏంప్యూలే ఉంది. ఎల్లా? ... పోనీ, ఇది బెడ్ త్రీ కిచ్చి, బెడ్ ఫోర్‌కు మాత్రం 'ఎడ్రినో ఎఫిడ్రిన్' లోడ్

చేద్దాం. సూపరింటెండెంటు వచ్చాక కొత్త స్టాకుకు ఇండెంట్ పెట్టాలి అనుకుంది. రెండు సిరింజలనిండా మందు నింపుకుంది. "నేను ఇంతమందిని సేవ్ చేస్తున్నాను. నన్నే దేవుడు సేవ్ చేస్తున్నాడు? నా బతుకు అంతకంతకూ బుగ్గితోనే నిండుతూంది" అనుకుంటూ ఆమె వార్డులోకి నడిచి బెడ్‌ల ద్గరికి వచ్చింది నర్స్ పేషెంట్లను పట్టుకోగా, ఆమె ఆ ఇద్దరికీ చెరొక ఇంజెక్షనూ ఇచ్చింది. ఖాళీ సిరింజిలను నర్స్ చేతిలో పెట్టి తాను తిరిగిరూమ్‌లోనికి వచ్చింది

కుర్చీలో కూర్చుని టేబిల్ మీద తల పెట్టిన రెండు మూడు నిమిషాల్లో ఆమె మాగన్ను నిద్రలోకి జారుకుంది.

★ ★ ★

"డాక్టర్, డాక్టర్" కంగారుగా వచ్చినర్స్ లేపుతూంది. డాక్టర్ శ్రీమతి తుళ్ళిపడి లేచింది. "ఊఁ ఏమిటి?" ... " బెడ్ నెంబర్ త్రీ పేషెంట్ ఎక్స్‌పైర్డ్, డాక్టర్!" ( మూడోనంబరు బెడ్‌లోని రోగి మరణించిందండి)

ఒక్క మాటుగా మత్తంతా వదిలి పోగా శ్రీమతి లేచి గబగబా మూడో నెంబరు బెబ్ దగ్గరికి వచ్చింది. రోగిని పరీక్ష చేసింది. ఆమె చనిపోయి ఉంది." ఎస్.ఎక్స్‌పైర్‌డ్. కానీ ఎల్లా జరిగింది! నువ్వేదయినా ఇంజెక్షనిచ్చివా?"

" అహఁహఁ, నేనేమీ ఇవ్వలేదండి."

"ఆశ్యర్యంగా ఉందే! . సరే, ఆ కేసెల్లా ఉంది?"

డాక్టర్ శ్రీమతి, నాలుగో నంబర్ బెడ్ లో కదలిక లేకుండా సుఖంగా నిద్రపోతున్న రోగి దగ్గరికి వచ్చి పరీక్ష చేసింది." షి ఈజ్ పెర్‌ఫెక్టలీ ఆల్ రైట్" అంటూ మళ్లీ ఇవతల వైపు వచ్చి శవాన్ని పరీక్షగా చూస్తూ, " ఆశ్యర్యంగా ఉందే, ఎల్లా జరిగింది?... సరే గుడ్డ కప్పేయ్. నను వాష్ చేసుకొస్తాను" అంది. అక్కడినించి కదిలి రూమ్‌లోకి వచ్చింది.

కుర్చీలో కూర్చోబోయేటంతలో మెరుపుల్లా ఆలోచనలు ఆమె మస్తిష్కంలో నుంచి దూసుకు పోయాయి.'రాత్రి తను వాడింది వేరు వేరు ఇంజక్షన్స్ కదా!... కొంపదీసి 'ఎడ్రినో ఎఫిడ్రిన్'ను తను బెడ్ త్రీలో ఉన్న కార్డియాక్ పేషెంటు కివ్వలేదు కద!.. అదే జరిగి ఉంటుంది!... మైగాడ్, తప్పకుండా బతకవలసిన రోగి ఆమె! తను బలవంతంగా చంపేసింది! చ్చొ, చ్చొ,... ఎంతపని జరిగింది!' ఆమె లేచి ఎగిసే గుండెలతో అస్థిమితంగా పచార్లు చెయ్యటం మొదలు పెట్టింది.

బయట వరండాలో నర్స్ ఎవరితోనో మాట్లాడుతూన్న వినిపిస్తోంది.

గడియారం ఐదు గంటలు కొడుతూంది

రెండు మూడు నిమిషాల తర్వాత శ్రీమతి సింక్ దగ్గరికి వెళ్ళి, నోట్లో బ్రష్‌తో కిటకీ తెరిచి బయటకు చూసింది. మసక వెలుతురులో దూరాన విరిగి పడిపోయిన తురాయి చెట్లకొమ్మలు కనిపిస్తున్నాయి. చావగా మిగిలిన చిలకలు చెట్ల కొమ్మల మీద కూర్చోని కింద పడిపోయిన తమ గూళ్ళను, రెక్కలు విరిగి చచ్చి పడి ఉన్న తమ పిల్లలను చూస్తూ, మధ్య మధ్య తలలను పంకిస్తూ మౌనవ్రతాన్ని పాటిస్తున్నాయి. బాగా కురిసి వెలిసిన వర్షం కారణంగా డ్రెయిన్‌లో నీళ్ళు నిలిచి ఉన్నాయి. చల్లగా వీస్తున్న గాలి ఆహ్లాదకరంగా ఉంది. ఢిల్లీ స్టేషన్ నించి కాబోలు తెలుగు పాటలు వినిపిస్తున్నాయి.

యాక్టర్ శ్రీమతి అనుకొంది : "హుఁ నాలుగు గంటల పాటు చేయగలిగినంత విధ్వంసం చేసిన విధి ఇప్పుడు శాంతిని ప్రసాదిస్తూంది. శ్మశాన శాంతి! ప్రకృతైతే , తన నష్టాన్ని తానుగా కూడదీసుకోగలదు. కాని, తనెట్లా పూరించుకోగలదు. పోగొట్టిన ప్రాణాన్ని తిరిగి తెప్పించగలదా?"

ముఖానికి పౌడర్ వేసుకునేంతలో మరొక ఆలోచన ఆమె మెదడును దూసుకుపోయింది. 'అన్నట్టు, తనిచ్చిన ట్రీట్‌మెంట్ కేస్ షీట్లలో తను రికార్డు చేసినట్టులేదు... గుడ్ గాడ్! జరిగిందేదో జరిగింది. తనిప్పుడు జాగ్రత్తగా డెత్ రిపోర్టు ఇవ్వకపోతే కొంప మునుగుతుంది!... ఇంకా నయం సూపరింటెండెంటుకు తాను దొరికిపోలేదు!' పౌడర్ డబ్బా అక్కడ పడేసి ఆమె హడావుడిగా బెడ్‌ల దగ్గరికి వచ్చింది. కేస్ షీట్లను తీసుకొని ఇద్దరు పేషెంట్లకూ తాను ఎమినో ఫిలిన్ ఇచ్చినట్లుగా రికార్డుచేసింది. వాటిని బెడ్‌లకు తగిలిస్తున్నంతలో ఎవరో సన్నసన్నగా వెక్కివెక్కి ఏడుస్తున్న శబ్దం ఆమెకు వినబడింది. ఆమె తల ఎత్తి కిటికీ వైపు చూసింది.

★ ★ ★

కళ్ళు! రెండు చిన్న కళ్లు! కిటికీ ఊచలను పట్టుకొన్న, లేత చేతుల మధ్య ఉన్న కళ్ళు! చింపిరి జుట్టు కింద ఉన్న గోలీల వంటి కళ్ళు! ముక్కు అణుచుకొని పోయిన ఊచకు అటూ ఇటూగా ఉన్న కళ్ళు! కిందికి చారలు కడుతున్న కన్నీళ్ళతో నిండిన కళ్ళు! - ఎక్కువగా ఏడవటం వల్ల ఆ నీరసపు కళ్ళలో ఎర్ర జీరలు ఏర్పడి, హాలు లైటు కాంతిలో స్పష్టంగా కనుపిస్తున్నాయి. గది బయటి ఆవరణలో వ్యాపిస్తున్న తొలి తెలికాంతులు ఆ తలను, కోపించి శోకిస్తున్న దారిద్ర్య దేవత తలగా భాసింపచేస్తున్నాయి.

★ ★ ★

వాడు పది పన్నేండేళ్ల పిల్లడు. లోపలకు చూస్తూ వెక్కివెక్కి ఏడుస్తున్నాడు.

శ్రీమతి బెడ్‌ల దగ్గరనించి కదిలి పది అడుగులు వేసి కిటికీ దగ్గిరికి వెళ్ళింది. " ఎవర్రా, అబ్బాయ్, నువ్వు?" ... " మా అమ్మ నిజంగా చచ్చిపోయిందాండి?"... " ఊఁ, వెళ్ళి మీ నాన్నా వాళ్ళతో చెప్పు."..." ఎందుకు చచ్చిపోయిందండి?" శ్రీమతికి నోట మాట రాలేదు. వాడివంకే అలా చూస్తూ ఉండిపోయింది. హఠాత్తుగా ఆమె మనస్సు కల్లోలం అలుముకుంది.

వాడు అన్నాడు- " ఇవ్వాళ ఇంటికి వచ్చి నాజీతం కడతానని చెప్పిందండి. లేకపోతే పేరు తీసేస్తారండి. మా అమ్మ ఇంక రాదని నర్సత్త చెప్పిందండి. నిజంగా రాదాండి?"

హఠాత్తుగా, తగ్గిపోయిన ఆమె రక్త ప్రసరణ వేగం పెరిగింది. హృదయ స్పందనలు హెచ్చాయి. గుండె లోతుల్లో నుంచి ఏదో ఆవేదన పైకి తన్నుకొస్తున్నట్లుగా స్ఫురించగా అక్కడ నుంచోలేక కదిలి వేగంగా రూములోకి వచ్చి కుర్చీలో కూలబడింది శ్రీమతి. కొంచెసేపు తర్వాత నర్స్ లోపలికి వచ్చింది. శ్రీమతి అడిగింది, " నువ్వేనా వాడికీ విషయం చెప్పింది?"

"అవును , మాడమ్!"... " వాళ్ళ వాళ్ళను తీసుకురమ్మనమని చెప్పకపోయావా?" ..." వాడికింద ముగ్గురు చెల్లెళ్ళు తప్ప వాటి కింకెవరూ లేరండీ. వీళ్లు మా వీధి వాళ్ళేనండి. వీడి బాబు చాలాకాలం కిందటే చచ్చిపోయాడు. హాస్పిటల్‌లో చేరే రోజు వరకూ వీడి అమ్మ ఇస్తళ్లు కుట్టి, అప్పడాలు చేసి వీళ్ళను పోషించే దండి. ఇప్పుడు వీళ్లు దిక్కుమాలిన వాళ్లయ్యారు.... ప్చ్, ఎవరు చేసుకుంది వాళ్లనుభవించక తప్పుతుందాండి?"

అల్లకల్లోలమైపోయిన మనస్సుతో శ్రీమతి శూన్యంలోకి చూస్తూ కూర్చుండి పోయింది. క్రమంగా ఆమె కళ్లు అశ్రువులతో నిండసాగాయి.

★ ★ ★

ఉదయం ఎనిమిది గంటల ప్రాంతంలో సూపరింటెండెటు వచ్చాడు. శవం తాలూకు వారి మనుష్యులు కూడా ఎవరో వచ్చారు. జరగవలసిన విధులన్నీ జరిగిన తర్వాత వాళ్లు శవాన్ని శ్మశానికి తీసుకుని పోయారు.

★ ★ ★

డాక్టర్ శ్రీమతి ఆ రాత్రి తన ఇంట్లో పక్కమీద పడి దొర్లుతూంది. ఎంత ప్రయత్నించినా నిద్ర పట్టడం లేదు మాటిమాటికీ ఆ పసివాడి ఎర్రబడ్డ నీరసపు కళ్ళే జ్ఞాపకానికి వస్తున్నాయి ఆ నీరసపు చూపులు అతి దీనంగా ఆమెను వేడుకొంటున్నాయి ' మా అమ్మను బతికించవూ?' అని. శ్రీమతి మంచం మీద నించి దిగ్గున లేచి కూర్చుంది. 'అదుగో ఉ ఎరుపు. ఆ కళ్లలోని అసహాయత తనను బెదిరిస్తూంది. ' ఎవరి కర్మను వాళ్లు అనుభవించక తప్పదంటూంది. తన కింక నిష్కృతి లేదు... నిరాశ, నిస్పృహలతో వేగిపోయిన స్థితిలో అప్పుడు తానున్న మాట నిజమే అయినా, తను తన విదిని నిర్లక్ష్యం చెయ్యటమేమిటి? రెండు సిరింజిలను ఒక్కసారిగా లోడ్ చెయ్యటాన్ని ఏ డాక్టరు క్షమించగలడు? ఆ పిల్లవాడు తెలివైన వాడట! ఏడో క్లాసు చదువుతున్నాడట. ఒక్క సిరింజి స్ట్రోక్‌తో తాను వాడి భవిష్యత్తును నేలరాచి పారేసిందే! వాడి దారిద్ర్యాన్ని వందలు, వేలు రెట్లకు పెంచేసిందే! ఇటువంటి చావే తనకు సంభవిస్తే తనతమ్ముళ్ళూ, చెల్లెళ్ళూ కూడా ఇట్లాగే దరిద్రులవుతారుగదా! భూమిమీద శిక్ష నైతే తప్పించుకోగలిగింది కాని, పరమాత్మ ఎదట తప్పించుకోగలదా?- అమ్మో, ఈ ఆలోచనను తను భరించ, లేదు. తను చేసింది అతి దారుణమైన తప్పు. తానీ పాపాన్ని కడిగివేసుకోకపోతే తనకు నిష్కృతి లేదు. ఎట్లా? ఎట్లా' తీవ్రమైన ఆవేదనతో శ్రీమతి మంచం దిగి పచార్లు చెయ్యసాగింది.

తరవాతి నాలుగు రోజులూ ఇదే విధమైన మనో వ్యథతో , నిద్రాహారాలు సహించని స్థితిలో, డ్యూటీకి వెళ్ళలేక సెలవు పెట్టి ఇంట్లో కూర్చున్న శ్రీమతి అయిదోనాడు ఒక నిర్ణయానికి వచ్చేసింది. తన బాంక్ పాస్ బుక్ తీసి చూసుకుంది.' తను పదేళ్ళలో కష్టపడి దాచుకున్న సొమ్ము ఇది- పన్నెండు వేలు!' అనుకుంది.

★ ★ ★

డాక్టర్ శ్రీమతి హాస్పిటల్‌కు వెళ్ళి నర్సును తీసుకొని ఆ పిల్లవాడి ఇంటికి వెళ్ళింది. నలుగురు పిల్లలూ కాక,ఆ పూరింట్లో ఇంకో పెద్దవాడున్నాడు. తనను ఆ పిల్లలకు మేనమామగా అతను పరిచయం చేసుకున్నాడు. " ఈ పిల్లల భవిష్యత్తేమిటి?" శ్రీమతి అడిగింది.

" ఏముందమ్మా విశాఖపట్నం వీధుల్లో ముష్టెత్తుకోవటమే. నేను తప్ప వీళ్లకెవరూలేరు. వీళ్లకేదయినా చేద్దామన్నా నాదగ్గిరేముందమ్మా? నేనొక గర్భదరిద్రుణ్ణి." ఆ మనిషి గొంతు గద్గద మయింది.

రెండు మూడు నిమిషాలు మౌనంగా కూర్చొని, తరవాత శ్రీమతి అంది: " సరే, ఇటు వినండి. నాదబ్బు ఒక పదివేలు నేను మీ పిల్లవాడి పేర బాంకులో వేస్తాను. మైనారిటీ తీరాక మాత్రమే వాడు దాన్ని తీసుకోగలడు. మీరు గార్డియన్‌గా ఉండండి. ప్రతినెలా బాంకు వాళ్ళిచ్చే వడ్డీని మీరు వాడిచదువుకు వాడండి.వాడు పైకి వస్తే చెల్లెళ్ళను పైకి తెచ్చుకుంటాడు... విది వాళ్ల పట్ల చాలా రాక్షసంగా ప్రవర్తించింది. మీరు వాళ్లను ప్రేమతో చూస్తారని మాట ఇస్తే నేను ఈ ఏర్పాటును సంతోషంగా చేస్తాను. ఏమంటారు?'

అవధుల్లేని ఆనందంతో ఆ మనిషి ఉక్కిరిబిక్కిరైపోయాడు. కృతజ్ఞత చెప్పుకోవటానికి అతనికి మాటలు లేక నోరు తెరుచుకుని చూస్తూ ఉండిపోయాడు.

శ్రీమతి వాళ్లను తీసుకుని బాంకుకు వెళ్ళింది. తాను చెప్పిన విధంగా బాంకు వాళ్ళతో రాతకోతలు పూర్తిచేసింది.

★ ★ ★

ఆ రాత్రి నిద్రపోతున్న తన తమ్ముళ్లనూ, చెల్లెళ్ళనూ చూసి అనుకొంది శ్రీమతి: ' నాకింది వాళ్లుగా ఎందుకు పుట్టార్రా, నిర్భాగ్యుల్లారా? .. ఒరేయ్ క్రిష్ణా! నీకు బి ఇ. చదువెందుకురా? ఒసేవ్ సీతా! నీకు మెడిసినేమిటే దౌర్భాగ్యపు మొహమా! .. ఏడవండి, ఈ పాపిష్టి దానికి, జ్యేష్టాదేవతకు కింది వాళ్ళుగా ఎందుకు పుట్టామా?' అని ఏడవండి . అవునర్రా, ఎందుకు ఏడవటం? ఇంకా రెండువేలుందిగా,

దాంతో హాయిగా ఎంతో పైకి చదువుకోవచ్చు. దేశానికిసేవ చేయవచ్చు! అహోహా అహోహా  మతి భ్రమించిన శ్రీమతి అలమర వైపు నడిచింది

ఆమె దృష్టి గార్డినాల్ మాత్రం మీద పడింది 'ఓహో, మీరున్నారా? ఇక్కడ! వెరీ గుడ్! ఇంకేం కావాలి?... బాధలనుంచి తత్‌క్షణ విముక్తి! డైరెక్ట్‌గా స్వర్గం! ఆహోహో, అహోహో'.

హఠాత్తుగా ఆమె నవ్వు ఆగిపోయింది ముఖం బిగుసుకు పోయింది. ఆమె సీసాను చేతిలోకి తీసుకుంది 'ఓసి మృత్యువా! నా అంతట నేనుగా నిన్ను చస్తే ఆహ్వానించనే! నేను తప్పుచేసిన మాట నిజమే. కాని, నాకు నేనే శిక్ష వేసేసుకున్నాను గద! ఇంక నా పాపం నా వాళ్ళకు కొట్టదు గదా! ఇంక నీ అవసరం నాకేమిటి?... పోతే వాళ్ళను దరిద్రులను చేశానంటావా? ఆ తప్పు నాది కాదే ! అది ఆ దేవుడిదేలే! వాడు తానుగా చెయ్యలేని పనిని నా చేత చేయించాడే!.. భయంకర వాతావరణాన్ని సష్టించి, అందులో నా మనస్సును చికాకు పరిచి, తెలిసి ఎన్నడూ ఎవర్ని చంపని నా చేత మనిషి ప్రాణం నిలువునా తీయించాడే వాడు! - వెళ్ళు, చేతనైతే వెళ్ళి వాణ్ణి పట్టుకో! పోతే పో!' అనుకుంటూ ఆ సీసాని అలమార్లోకి విసిరేసి, దభేలుని తలుపులు మూసి, తాళం వేసేసి, ఆ తాళం చెవిని అటకమీద పడేట్లుగా పైకంటా విసిరేసింది శ్రీమతి

ఒక్క ఉదుటున వెళ్ళి మంచం మీద పడిపోయి వెక్కి వెక్కి ఏడవటం మొదలు పెట్టింది.

★ ★ ★

నెల రోజులు గడిచాయి.

ఒక రోజున డ్యూటీకి ఆలస్యంగా హడావుడిగా హాస్పిటల్‌కు వచ్చిన శ్రీమతిని వరండాలోనే నిలేసి సూపరింటెండెంటు అన్నాడు. "శ్రీమతీ, నీకో గుడ్ న్యూస్! గైనకాలజీలో రీసెర్చ్‌కి నిన్ను స్టేట్స్‌కు డెప్యూట్ చేసినట్లు ఆర్డర్స్ వచ్చాయి లక్కీ ఫెలో! రెండేళ్ళు కళ్ళు మూసుకున్నావంటే రీసెర్చ్ డిగ్రీ తెచ్చుకోవచ్చు. వీలయితే అక్కడ విజిటింగ్ ప్రొఫెసర్‌గా చేసి లక్ష రూపాయిల డబ్బూ తెచ్చుకోవచ్చు.... అన్నట్టు వెస్ట్ జర్మనీ నుంచి నా థర్డ్ సన్ ఉత్తరం రాశాడు. వాడి మనస్సులో అంతటా నువ్వే నిండిపోయి ఉన్నావట!... మరి, మరి, దాని అర్థం ఏమిటో....." పండు మీసాల కింద నుంచి ముసిముసిగా నవ్వుతూ తల గోక్కున్నాడు సూపరింటెండెంటు.

హటాత్తుగా తన రెండు చేతుల్తోనూ అతని చేతిని పట్టుకుని తన మొహానికద్దుకుంది డాక్టర్ శ్రీమతి. ఆవేశంతో గొంతు గద్గదమవంగా అంది "కృతజ్ఞురాలిని, డాక్టర్, థాంక్స్! అంతా మీ ఆశీర్వచన బలం!" మరుక్షణంలో ఆమె బావురుమని ఏడ్చేసింది

సంతోషిస్తున్న మనిషితో ఏడుపెందుకు పొర్లుకు వచ్చిందో తెలుసుకోలేక సూపరింటెండెంటు నిర్ఘాంతపోయాడు.

ఎవరు ఏం చెబితే అతనికి ఏ మర్థమవుతుంది

(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక 10-11-74)

★ ★ ★ ★ ★ ★ ★ ★ ★